క్లుప్తంగా

ఏపీ పోస్టల్ స్పోర్ట్స్ బోర్డు మెంబర్‌గా చంద్రశేఖర్

పాలకొండ/ పాలకొండ రూరల్: ఏపీ పోస్టల్ స్పోర్ట్స్ బోర్డు మెంబర్‌గా నగరపంచాయితీ పరిధి ఎన్‌కే రాజపురానికి చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు వెన్నపు చంద్రశేఖర్ నిమితులయ్యారు. ఈమేరకు పోస్టల్ స్పోర్ట్స్ బోర్డు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విజయవాడ పోస్టల్‌శాఖలో సీనియర్ ఆడిటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1997లో కబడ్డీ క్రీడాకారుడిగా పోస్టల్ శాఖలో ఉద్యోగం పొందారు. ప్రస్తుతం బోర్డు మెంబర్‌గా నియమితులు కావడంపై పట్టణ మాజీ చైర్మన్ పల్లా కొండలరావు, వెన్నపు శ్రీనివాసరావు, సుంకరి అనీల్‌దత్‌తో పాటు కబడీ క్రీడాకారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు భీంపురం వంతెన ప్రారంభం

కురుపాం: మండలంలోని భీంపురం వద్ద నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలంతా హాజరుకావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ ఉరిటి రామారావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని పెద్దూరులో ఉన్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి మొత్తం 105 ఇళ్లు మంజూరు కాగా 45 నిర్మాణాలు జరుగుతున్నాయని, మిగతా వాటి పనులు కూడా ప్రారంభమయ్యేలా చూడాలని తెలిపారు. జగనన్న కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, సర్పంచ్ టి.ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లదుమ్మ, చినమేరంగి, పెదమేరంగి, అల్లువాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి ఎస్.వెంకటరావు పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో గ్రామంలో ఓటింగ్ జరిగే అవకాశాలపై చర్చించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి తెలిపారు. గురువారం మండలంలోని చిలకాం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఆమె ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. శీతాకాలం నేపథ్యంలో జలుబు, దగ్గు, ఆయాసం, వాత వ్యాధులతో పాటు జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, పాడిరైతులు పాల్గొన్నారు.

పశువిజ్ఞాన బడిని సద్విని యోగం చేసుకోవాలి

కురుపాం: పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి శైలజ పాడిరైతులను కోరారు. మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ, దండుసూర గిరిజన గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపిల్లలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ చేపట్టారు. అనంతరం మేకపిల్లల మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు బి.ప్రియాంక పాల్గొన్నారు.

గడ్డికుప్పలు దగ్ధం

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన అల్లుపెద్దింటి హరిబాబుకు చెందిన గడ్డి కుప్పలు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. వరి కుప్పలను ట్రాక్టర్ సహాయంతో ధాన్యం మర పట్టిస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌ను తాకటంతో నిప్పురవ్వలు పక్కనే ఉన్న గడ్డి, వ్యర్థాలపై పడి ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారి సర్వేస్వరరావు శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకని మంటలను అదుపు చేశారు. పక్కన ఉన్న వరి కుప్పలకు మంటలు వ్యాపించకుండా నిలువరించారు.


సీతంపేట: ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి


వీరఘట్టం: వీరఘట్టంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు


పాలకొండ: సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు


పాలకొండ రూరల్: కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు


పాలకొండ: పేదలకు దుప్పట్ల పంపిణీ


భామిని: పసుకుడిలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కళావతి


భామిని: మండల పరిషత్ వద్ద సీఎం బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జననేతకు జన్మదిన శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల నడుమ ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, హ్యాపీ బర్త్ డే సీఎం సార్.. హ్యాపీ బర్త్ డే జగనన్న.. అని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నో ఒడిదుడుకుల మధ్య రాజకీయంగా ఆయన ఎదిగిన తీరును నేతలు ప్రశంసించారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో తనదైన మార్క్‌తో దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని, జనమంతా వన్స్ మోర్ సీఎం సార్ అని అంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు, మిఠాయిలు పంచిపెట్టగా, మరికొన్ని చోట్ల రక్తదానం చేసి, జననేత జగనన్నపై తమకున్న అభిమానం చాటుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్.


కొమరాడ: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్‌కు బర్త్ డే విషెస్ తెలుపుతున్న పార్టీ శ్రేణులు


గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు


జియ్యమ్మవలస: పెదమేరంగిలో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ గొప్పతనం వివరిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు


కురుపాం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు


కురుపాం: కురుపాం ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


గరుగుబిల్లి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు


గరుగుబిల్లి: వృద్ధుడికి పండ్లు, రొట్టెలు అందజేస్తున్న ఎంపీపీ రామారావు, తదితరులు

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

పాలకొండ రూరల్: ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. స్థానిక అభయాంజనేయ ఆలయం వద్ద గురుబిల్లి అప్పలనాయుడు అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ధాన్యం ఉభయ గోదావరి జిల్లాలకు లైన్‌కు తరలించి రైతుకు న్యాయం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో స్థానిక మిల్లర్లు రద్దు పేరిట క్వింటాకు 5 కేజీలు అదనంగా సేకరిస్తూ.. రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను కారణంగా తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంబ్లింగ్ విధానంలో రైతుకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మహాసభల నిర్వహణకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో కె.రామ్మూర్తినాయుడు, వి.రమణమూర్తి, బొత్స గౌరునాయుడు, తదితరులున్నారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

సంక్షిప్తంగా..

ఈవీఎంల వినియోగంపై అవగాహన

భామిని: మండలంలోని పసుకుడి గ్రామంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎ.ధర్మారావు, పి.ఈశ్వరరావు, జి.ప్రసాదరావు కలిసి, ఓటర్లకు ఈవీఎంల ఆధారంగా ఓటు ఎలా వేయాలన్న దానిని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు సిద్ధం కావాలి

పాలకొండ రూరల్: ఈ నెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాథులు తెలిపారు. నియోజకవర్గ, మండల క్రీడా నిర్వహకులు వి.పుష్పనాథం, ఆర్.రాములు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతీ సచివాలయ పరిధిలో ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న క్రీడాకారులను జట్లుగా సిద్ధం చేయాలన్నారు. పీడీఎస్ బియ్యం ప్రతీ ఇంటికి అందించేలా సచివాలయ సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఇందుకు సంబంధించి వలంటీర్లను సమన్వయం చేయాలన్నారు. వారికి గౌరవ వేతనంతోపాటు అదనంగా రూ.750 అందించనట్లు తెలిపారు. సమవేశంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, అడ్మిన్ సెక్రటీలు, వలంటీర్లు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలి

గుమ్మలక్ష్మీపురం: మండలాన్ని ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని గొరడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలైన ఎల్-1, ఎల్-2, ఎల్-3లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతీ రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, వారంతా ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలని తెలిపారు.

91 మందికి కంటి పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని వండువ షిర్డీసాయి ధ్యాన మందిరంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 91 మందికి డాక్టర్ సురేష్‌కుమార్ కంటి పరీక్షలు చేశారు. వారిలో 42 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వారికి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. శిబిరానికి హాజరైన అందరికీ ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం భోజన వసతి కల్పించారు.

చెకుముకి టాలెంట్ టెస్టు

వీరఘట్టం: జనవిజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గురువారం 8,9,10 తరగతుల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హైస్కూల్ హెచ్ఎం కొంబర బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు బి.ఎం.గౌరీశ్వరరావు, ఎస్.సతీష్, వి.శ్రీధర్, పి.వెంకటేశర్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి ఎంపీపీ పాఠశాల(బీసీ)ను ఎంఈవో-1 ఎస్.నాగభూషణరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రగతితో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

పాలకొండ రూరల్, సీతంపేట: సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ కోరారు. మండలంలో ఎం.సింగుపురం సచివాలయ పరిధిలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మళ్లీ రాష్ట్రానికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలో వివరించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరించారు. సీతంపేట మండలం కుశిమి గ్రామంలో ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. మరోసారి జగనన్నను సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొరిశెట్టి గిరిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు, సర్పంచ్ మండంగి జగ్గారావు, ఎస్టీ సెల్ కన్వీనర్ తోయక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని గుణదతీలేస్ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ప్రభుత్వ పథకాల బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును పార్టీ నాయకులు వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శెట్టి మధుసూదనరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో సంక్షేమ డ్యాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు


సీతంపేట: కుశిమిలో 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు


కొమరాడ: గుణదతీలేస్ గ్రామంలో జై జగన్ నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో జై జగన్ నినాదాలు చేస్తున్న ఎంపీపీ దీనమయ్య, పార్టీ నేతలు

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓకు గాయాలు

వీరఘట్టం: సీఎస్‌పీ రహదారిలో ఎం.రాజపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిదిమి వీఆర్‌ఓగా పనిచేస్తున్న వెలగాడ రాజారావుకు తీవ్ర గాయాలయ్యాయి. సచివాలయంలో విధులు ముగించుకుని బైక్‌పై వీరఘట్టం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య కోసం శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి ఆలయంలో దేవీ సహిత జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జై గురుదత్త హోమం చేపట్టారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం చేశారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

సీతంపేట: దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్‌ప్లాన్లు, బోధనా విధానం, తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండగొర్రె సుబ్బారావు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

ప్రకృతి వ్యవసాయంతో మేలు

పాలకొండ రూరల్: రైతులు సేంద్రియ విధానంలో సాగు చేయటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏపీ ప్రకృతి వ్యసాయ విభాగం అధికారి పి.సూరపునాయుడు అన్నారు. మండలంలోని గోపాలపురం సమీపంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై రైతులకు అగాహన కల్పించారు. సంబంధిత శాఖ అధికారులు లక్ష్మినాయుడు, తిరుపతిరావు, వెంకటనాయుడు తదితరులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కనుముల కల్పన, మహిళా రైతులు ఉన్నారు.


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న సూరపునాయుడు, కల్పన తదితరులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం గురువారం ట్యాబ్‌ల పంపిణీ చేసింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీటిని అందజేస్తున్నారని, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

-సాక్షి నెట్‌వర్క్.


పాలకొండ: ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో వెంకమ్మపేట పాఠశాల విద్యార్థులు


కొమరాడ: కోటిపాంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మి, సర్పంచ్ సుగుణ


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య


గరుగుబిల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంపీపీ రామారావు


వీరఘట్టం: వండువ హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి